మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్రభాకర్‌రెడ్డినగర్ ఇఫ్తార్ విందులో కార్పొరేటర్ పండాల



అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం ఆధ్వర్యంలో...

కూకట్‌పల్లిలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ/బాలానగర్/అల్లాపూర్, మార్చి 27: కూకట్‌పల్లి నియోజకవర్గంలో మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రార్థనలు చేశారు. పవిత్ర మాసంలో ముస్లిం సోదరులందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూరం తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, అబ్దుల్ రహీం ఉన్నారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ప్రభాకర్‌రెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యా రు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భిక్షపతి, అబ్దుల్ బాకీ, సలావుద్దీన్, వీరేశం గుప్తా, సురేందర్ నాయుడు పాల్గొన్నారు. బాలనగర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేత సోఫీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంగళరావు, మందడి సుధాకర్‌రెడ్డి, మహమ్మద్ ఖాజా ఉన్నారు.

అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్లు మందాడి శ్రీనివాస్‌రావు, పండాల సతీష్‌గౌడ్, ఆవుల రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు పాల్గొన్నారు.

గాయపడిన పారిశుధ్య కార్మికురాలికి ఆర్థిక సాయం

బాధిత కార్మికురాలికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్, మార్చి 27: పారిశుధ్య కార్మికురాలికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు పరామర్శించి పదివేల ఆర్థిక సహాయాన్ని అందించి మనోధైర్యాన్ని కల్పించారు. కొంపల్లి మున్సిపల్ పరిధి 12వ వార్డులో గత నెలలో విధుల్లో ఉన్న స్వీపర్ బాలమణిని ఏమరాల్డ్ అపార్టుమెంట్ వద్ద విధులు నిర్వహిస్తుండగా వెనక నుంచి కారు ఢీ కొట్టడంతో స్థానికులు 108 సాయంతో ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. నడుము కింద భాగంలో (ఫీమర్) యముక విరగడంతో సర్జరీ నిర్వహించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు గురువారం యాదిరెడ్డి బండ వినాయకనగర్‌లోని బాధితురాలి ఇంటికెళ్లి సాయం అందజేశారు. కార్యక్రమంలో కొంపల్లి పట్టణ అధ్యక్షుడు సతీష్ సాగర్, జిల్లా ఉపాధ్యక్షు డు రాజిరెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ శివాజీరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈ, ఎంటెక్ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 27: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్‌కు చెందిన బండారు సూర్య ప్రకాష్‌కు రూ.1లక్ష, మహమ్మద్ పీర్ అహ్మద్‌కు రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు ఆర్థిక సహాయం ఎంతగానో ఉపయోగపడుతుందని, పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

రక్తదానం చేయడం అభినందనీయం

రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 27: యువత రక్తదానం చేయడం అభినందనీయమని కేపీహెచ్‌బీకాలనీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదిన సందర్భంగా అఖిలభారత రామ్‌చరణ్ యువత ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీకాలనీ పోచమ్మ ఆలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్ శ్రీనివాసరావు జనసేన పార్టీ ఇన్‌చార్జి ముమ్మా రెడ్డి ప్రేమ్‌కుమార్, ఆలిండియా చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ మేనేజర్ రవణం స్వామి నాయుడు ప్రారంభించారు. చిరంజీవి ఇచ్చిన స్ఫూర్తితో రక్తదానం, నేత్రదానం చేయడానికి యువత ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నూతి రాంబాబునాయుడు, భుట్టో రాంబాబు, బీఎస్ఎన్ రాజు, నిర్వాహకులు సందీప్, ధనపాల్, అరవింద్ చెర్రీ, స్థానిక నేతలు కొల్లా శంకర్, వెంకటేశ్వరరావు, ప్రసాద్, సుబ్బు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

బహుమతుల పంపిణీలో ఏసీపీ శ్రీనివాసరావు

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 27: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని ఏసీపీ శ్రీనివాసరావు, వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు అన్నారు. జేఎన్టీయూహెచ్‌లో నిర్వహించిన వీసీ ట్రోఫీ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచి మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని అన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందొచ్చని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్లు అశోక్, పణికుమార్, కేపీహెచ్బీకాలనీ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీలతరెడ్డి తదితరులు ఉన్నారు.

సీసీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

కుత్బుల్లాపూర్, మార్చి 27: కొంపల్లి మున్సిపాలిటీ జయభేరి పార్క్ బాలాజీ హైట్స్ అపార్ట్మెంట్ నుంచి అమర్ తేజ అపార్ట్మెంట్ వరకు సుమారు రూ.27 లక్షల మున్సిపల్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్‌రెడ్డి పార్టీ శ్రేణులు, స్థానికులతో కలిసి ప్రారంభించారు. కొంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ జమ్మి దేవేందర్, మాజీ ఉప్పు సర్పంచ్ అన్నారం గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆదిరెడ్డి మోహన్‌రెడ్డి, జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, కావాలి గోపాల్ మాజీ వార్డ్ మెంబర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవి, మాజీ కోఆప్షన్ మెంబర్ షాక్ ఇబ్రహీం, అశోక్‌రెడ్డి, పూర్ణచందర్‌రావు, ఉపేందర్‌రెడ్డి, అంజిముదిరాజ్, నవీన్‌ముదిరాజ్, కాలనీవాసులు గొర్రె వెంకట్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, దయాకర్ గుప్తా తదితరులు పాల్గొనారు.



పనుల ప్రారంభంలో పాల్గొన్న పలువురు ప్రజాప్రతినిధులు

నవ వధువు ఆత్మహత్య

ముషీరాబాద్, మార్చి 27: అత్తింటి వేధింపులు భరించలేక నవవధువు భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భోలక్ పూర్ నివాసి సౌజన్య(26)కు మూసాపేట్ కు చెందిన జిమ్ నిర్వాకుడు ఏ శభరీశ్‌తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. కాగా.. సౌజన్య గుండెకు రంధ్రం ఉన్న విషయంపై భర్తతోపాటు, అత్తవారింటి వారు వేధింపులకు గురి చేయసాగారు. అత్తింటి వారి వేధింపులు భరించలేక సౌజన్య గురువారం పుట్టింటికి వచ్చిన ఆమె భవనం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ట్ గ్యాలరీలో పెయింటింగ్ ఎగ్జిబిషన్

ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చిత్రాలను తిలకిస్తున్న కళాకారులు

కొండాపూర్, మార్చి 27: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ గ్యాలరీలో కొనసాగుతున్న బర్డ్స్ ఐ వ్యూ చిత్ర ప్రదర్శనలోని చిత్రాలను గురువారం పలువురు కళాకారులు ఆసక్తిగా తిలకించారు. 40 మంది చిత్రకారులు వేసిన 100 చిత్రాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఈ నెల 20న ప్రారంభమైంది. అందమైన చిత్రాలను తిలకించేందుకు కళాకారులతో పాటు సందర్శకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రదర్శన మార్చి 30 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నిజాంపేటలో సినీనటి అనన్య సందడి

మిఠాయి దుకాణాన్ని ప్రారంభిస్తున్న సినీనటి అనన్య

హైదరాబాద్: నిజాంపేట ఐటెన్షన్ లైన్ హైదర్‌నగర్ కాలనీలో గురువారం సినీ నటి అనన్య సందడి చేశారు. ఈ సందర్భంగా స్వీట్ వన్ షాప్ ప్రారంభించారు. అనంతరం నటి అనన్య మాట్లాడుతూ నగరంలో కార్పొరేట్ స్వీట్ షాపులు ఉన్నప్పటికీ ఈ స్వీట్ వన్ షాప్ స్వచ్ఛత, నాణ్యత ప్రమాణాలు ఇక్కడి ప్రత్యేకత అని అన్నారు. ఎమ్మెల్యే అరకపుడి గాంధీ, నిజాంపేట్ 123వ వార్డు కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్, ప్రముఖులు పాల్గొన్నారు. నిజాంపేట ప్రజలు భారీగా హాజరై మిఠాయిలు కొనుగోలు చేశారు. అనంతరం షాపు మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ నారాయణ మాట్లాడుతూ తాను 30 ఏండ్లుగా క్యాటరింగ్ రంగంలో అపారమైన అనుభవాన్ని ఘడించానని తెలిపపారు. రుచికరమైన వంటలను అందించి కస్టమర్ల మన్ననలు పొందామని, అదే స్ఫూర్తితో నగరంలో కార్పొరేట్ స్వీట్ షాపులకు దీటుగా తమ స్వీట్ వన్ షాపు తక్కువ ధరలకే నాణ్యమైన, స్వచ్ఛమైన, రుచికరమైన స్వీట్లు అందుబాటులో ఉంచామని అన్నారు. నగరంలో ఇప్పటి వరకు మూడు షాపులను ప్రారంభించామని తెలిపారు. వనస్థలిపురం, చింతల్, నిజాంపేట పరిధి హైదర్ నగర్‌లో ప్రారంభించామని పేర్కొన్నారు.

ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ పరిధి రాజరాజేశ్వరి కాలనీలో సిరీన్ కేరళ ఆయుర్వేదిక్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ అన్నారు. గురువారం థామస్ ఏర్పాటు చేసిన సెరీన్ సీనియర్ లివింగ్ కేర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేరళ సీనియర్ వైద్యులతో ఆయుర్వేదిక్ చికిత్సలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సెరీన్ లివింగ్ కేర్ ఆయుర్వేదిక్ సెంటర్ ద్వారా రోగాలు నయం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, బాబు ఉన్నున్ని, కనకదాస్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. – బాలానగర్, మార్చి 27:

సికింద్రాబాద్ నుంచి ఎల్లమ్మబండ వరకు ఆర్టీసీ బస్ సర్వీసు

జీడిమెట్ల, మార్చి 27: సికింద్రాబాద్ నుంచి గాజుల రామారం వరకు వచ్చే ఆర్టీసీ బస్సులను ఎల్లమ్మబండ వరకు పొడ గించినట్లు జీడిమెట్ల డిపో మేనేజర్ అంజనేయులు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండ సికింద్రాబాద్ నుంచి మొదటి బస్సు ఉదయం ఉదయం 5 గంటల నుంచి సుమారుగా ప్రతి 0.25 నిమిషాలకు ఉందని తెలిపారు. చివరి బస్సు 20.25 గంటలకు ఉందని తెలిపారు. అదేవిదంగా ఎల్లమ్మబండ నుంచి మొదటి బస్సు 6.10 గంటలకు సుమారుగా ప్రతి 0.25 నిమిషాలకు ఉందని, చివరి బస్సు 21.35 గంటలకు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎయిర్ పోర్టుకు కొత్త ఏసీ బస్ సర్వీసులు

బాలానగర్: శంషాబాద్ రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్టు కు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం నాలుగు కొత్త బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు కూకట్ పల్లి డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి కొండాపూర్ మీదుగా లింగంపల్లి చేరుకునే బస్సు రూట్‌ను ఏకే రూట్ అని పిలుస్తారని పేర్కొన్నారు. ఈ బస్సు లింగంపల్లి నుంచి చందానగర్, ఆల్విన్ ఎక్స్ రోడ్, హఫీజ్ పేట్, కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి మీదుగా ఎయిర్ పోర్టు కు వెళుతుందని తెలిపారు. ఈ బస్సులో 50 నిమిషాలకు ఒక ఏసీ బస్సు బయలుదేరుతుందని తెలిపారు. అదేవిధంగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి జేఎన్టీయూ మీదుగా మియాపూర్‌కు చేరుకునే బస్ రూట్‌ను ఏజే రూట్‌గా పిలవబడుతుందని తెలిపారు. మియాపూర్ నుంచి వయా జేఎన్టీయూ మీదుగా శిల్పారామం హైటెక్ సిటీ రాయదుర్గం డైవర్సిటీ గచ్చిబౌలి మీదుగా ప్రతి 15 నిమిషాలకు ఒక ఏసీ బస్సు అందుబాటులో ఉంటుందని ఆమె తెలిపారు. ఏకే రూట్ బస్సు కు రూ.250లు, ఏజే రూట్ బస్సుకు రూ.300 టికెట్ జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు ఆయా బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో రేణుక

జీడిమెట్ల, మార్చి 27: మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించు కోవచ్చునని కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్ సీడీపీఓ రేణుక అన్నారు. గురువారం సుభాష్‌గర్ డివిజన్ పరిధి సురారంలోని లూయిస్ బ్రెయిలీ భావన్ మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణను ప్రారంభించారు. ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామ కృష్ణ పాల్గొన్నారు. సీడీపీఓ మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా నిర్మూలన అందరూ భాగస్వామ్యం అయినప్పుడే సమూలంగా సాధ్యమన్నారు. మానవ అక్రమ రవాణా ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అని అన్నారు. ప్రతి అంగన్వాడీ టీచర్ తమ పరిధిలోని మహిళలకు, అమ్మాయిలకు అక్రమ రవాణాపై అవగాహనా కల్పించాలని సూచించారు. సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. బలరామ కృష్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం ప్రజ్వల సంస్థ 28 ఏండ్ల నుంచి పనిచేస్తున్నదని చెప్పారు. ఇప్పటి వరకు 29,500 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ అవార్డు గ్రహిత డాక్టర్ సునీత కృష్ణన్ సంబంధిత ఐసీడీఎస్, డీఆర్డీఏ, పోలీస్, జ్యుడీషియల్, ఎడ్యుకేషన్, డిపార్ట్మెంట్ సహకారంతో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో ప్రభుత్వం ద్వారా అక్రమ రవాణా సంబంధిత చట్టాలు భారతీయ న్యాయ సంహిత , ఐటీపీఏ, ఫోక్సో, బాల్య వివాహల నిషేధం చట్టం, టోల్ ఫ్రీ నంబర్స్ 1098 (చైల్డ్ లైన్) 100 (పోలీస్), 181 (మహిళా హెల్ప్ లైన్) 1930 (సైబర్ క్రైం), సైబర్ వెబ్సైట్ ద్వారా ఏవిదంగా కంప్లైంట్ చేయాలో శిక్షణలో వివరించచారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కృష్ణ ప్రియ, సుజాత, శ్రీదేవి, స్పందన ప్రజ్వల ప్రతినిధులు కోఆర్డినేటర్ సురేష్ కుమార్, అంబర్ సింగ్, మిథాలీ రాజ్, కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్ అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

వాణిజ్య వ్యవహారాలపై అంతర్జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

దుండిగల్,మార్చి27: ప్రగతినగర్‌లోని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (వీజేఐఎం) కళాశాలలో స్థిరమైన వ్యాపార సరళిలో భవిష్యత్తు వాణిజ్య వ్యవహారాల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ఫిలిపిన్స్‌కు చెందిన మరియానో మరికోస్ స్టేట్ వర్సిటీ ప్రతినిధి డా.అరోలినే గొంజాలిస్ హాజరయ్యారు. కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి జనరల్ సెక్రెటరీ కోడి దుర్గాప్రసాద్, డైరెక్టర్ డా.భరత్‌భూషణ్ సింగ్‌తోపాటు పలు దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

అమీర్‌పేట, మార్చి 27 : ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ సమీపంలో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని ఎస్టీఎఫ్ బృందం అరెస్ట్ చేసింది. గురువారం నిర్వహించిన ఈ దాడుల్లో మహమ్మద్ రహీం, మహమ్మద్ ఫక్రుద్దీన్‌లను అరెస్టు చేసి.. వారి నుండి 2.78 గ్రాముల ఎండీఎంఏ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంటే డ్రగ్స్ అమ్మకాలతో సంబంధం ఉన్నట్టు గుర్తించిన సౌదీ అరేబియాకు చెందిన స ఫాన్, బెంగళూరుకు చెందిన ఇబ్రహీం ల పై కూడా కేసులు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: సింగరేణి గిరిజన భూనిర్వాసితులకు తక్షణమే న్యాయం చేయాలని లంబాడ ఐక్యవేదిక ఓయూ విద్యార్థి నాయకుడు రాజేశ్ చౌహాన్ డిమాండ్ చేశారు. గిరిజనుల ఇళ్లకు సింగరేణి యాజమాన్యం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ డిమాండ్ల తో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గిరిజన విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. రాజేశ్ చౌహాన్ మాట్లాడుతూ హైకోర్డు స్టే ఆర్డర్ జారీ చేసినప్పటికీ గిరిజనుల ఇళ్లను సింగరేణి యాజమాన్యం కూల్చివేసిందని మండిపడ్డారు. సింగరేణి నిర్లక్ష్య వైఖరికి నిరసనగా అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించినట్లు చెప్పారు. దాదాపు 80కి పైగా గిరిజన కుటుంబాల ఇళ్లకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా, న్యాయం చేయకుండా సింగరేణి యాజమాన్యం మొండిగా కూల్చివేసి, భూములను స్వాధీనం చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, దుద్దిల్ల శ్రీధర్‌బాబు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకూ రాష్ట్రంలోని గిరిజన, ప్రజా సంఘాలతో కలిసి అసెంబ్లీ, ప్రజాభవన్, సింగరేణి భవన్, రాజ్ భవన్ ముట్టడించనున్నట్లు తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 27: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీకాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 18, బెండకాయ 38, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 28, కాకరకాయ 35, బీరకాయ 40, క్యాబేజి10, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 18, కాలీఫ్లవర్ 18, దొండ 35, చిక్కుడు 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 35, ఆలుగడ్డ 23, కీరా 15, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 23, ఉల్లిగడ్డ 24, చింతకాయ –, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠాని 40, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

మార్చురీలో మగ్గుతున్న గుర్తుతెలియని శవం

దుండిగల్, మార్చి 27: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గాంధీ వైద్యశాల మార్చురీలో వారం రోజులుగా మగ్గుతోంది. దుండిగల్ పోలీసులు వివరాల ప్రకారం.. సుమారు 45 ఏండ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని ముత్తూట్ ఫైనాన్స్ బిల్డింగ్ వద్ద ఉన్నట్లు ఈ నెల 23 పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాల కోసం ఆరా తీయగా సమాచారం లభించలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు శవాన్ని అదేరోజు గాంధీ మార్చురీకి తరలించారు. అప్పటి నుంచి శవం కోసం ఎవరు రాక పోవడంతో మార్చురీలోనే మగ్గుతోంది. మృతుడి ఒంటిపై క్రీం కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని, ఎడమవైపు జేబు పైన నిప్పాన్ సర్వీసెస్ అనే స్టిక్కర్ ఉందని, గ్రీన్ కలర్ చెక్స్ లుంగీ ధరించాడని తెలిపారు. చామనసాయ రంగులో ఉన్నాడన్నారు. వివరాలు తెలిసినవారు గాంధీ మార్చురీలో గాని, దుండిగల్ పోలీస్ స్టేషన్లో గాని సంప్రదించాలని కోరుతున్నారు.